జగనన్న పాలనలో పేదలకు సొంతిళ్లు

- వైఎస్సార్‌సీపీ 'ఉత్తర' సమన్వయకర్త కె.కె.రాజు
- ఏఎస్సార్ నగర్ టిడ్కో గృహాల రిజిస్ట్రేషన్ పత్రాల పంపిణీ
- లబ్ధిదారుల ఆనందోత్సాహాలు


టిడ్కో లబ్ధిదారులకు హక్కు పత్రాలను అందజేస్తున్న కె.కె.రాజు, కార్పొరేటర్ కంపా హనోకు. చిత్రంలో పైడి రమణ


రిజిస్ట్రేషన్ పత్రాల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న ఏఎస్సార్ నగర్ టిడ్కో గృహాల లబ్ధిదారులు

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 45వ వార్డు ఏఎస్సార్ నగర్‌లో శుక్రవారం పండగ వాతావరణం నెలకొంది. జీవీఎంసీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, కార్పొరేటర్ కంపా హనోకు ఆధ్వర్యంలో టిడ్కో గృహాల రిజిస్ట్రేషన్ పత్రాల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథి వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు చేతుల మీదుగా లబ్ధిదారులకు గృహ హక్కు పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల సంక్షేమం కోసం అనేక పథకాలు అమలు చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో ప్రతీ పేదవాడి సొంతింటి కలను నిజం చేసేలా అందరికీ ఇళ్లు, ఇళ్ల స్థలాలు అందజేస్తున్నారని తెలిపారు. తాను ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్తగా బాధ్యతలు చేపట్టిన 2018లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా ఏఎస్సార్ నగర్‌లో పర్యటించినపుడు ఈ ప్రాంత దారుణ పరిస్థితిని చూసి చాలా బాధపడ్డానని కె.కె.రాజు అన్నారు. నాటి ప్రభుత్వం, స్థానిక ఎమ్మెల్యే ఏఎస్సార్ నగర్‌వాసులను మోసం చేసి, విలువలేని పనికిరాని కాగితాలను వారి చేతుల్లో పెట్టారన్నారు. ఇక్కడ నివసించేది 324 మంది అయితే.. నాటి ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు సుమారు 411 మందికి ఇటువంటి విలువలేని కాగితాలను అందజేశారని గుర్తుచేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మీపై ఏ భారం పడకుండానే ఇళ్లకు రిజిస్ట్రేషన్ కూడా చేయించి ఆ పత్రాలను మీ చేతుల్లో పెడుతోందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వమే గృహ లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్లు చేయించి, వైఎస్సార్ హయాంలో ఇచ్చిన ఇళ్లకు సైతం పట్టాలను అందజేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌కే దక్కుతుందన్నారు. అర్హత కలిగి ఇళ్లు దక్కని వారికి త్వరలోనే ఇదే ప్రాంతంలో ఇళ్లు వచ్చేలా చూస్తానని, ఇక్కడి ఖాళీ స్థలంలో హాస్పిటల్, అంగన్‌వాడీ భవనం, బడి, పార్క్ లాంటివి నిర్మించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రభుత్వం పేదలు, విద్యార్థుల కోసం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అభివృద్ధి, సంక్షేమం కనిపించదా?

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ప్రతిపక్షాలకు ముఖ్యంగా మాజీ ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజుకు కనిపించడం లేదని కె.కె.రాజు దుయ్యబట్టారు. సీఎం జగన్ పాలనలో అభివృద్ధి, సంక్షేమంపై చర్చించేందుకు తాను సిద్ధంగా ఉన్నానని ఆయన సవాల్ విసిరారు. త్వరలో ఎన్నికలు రానున్నాయని, విష్ణుకుమార్‌రాజు ఈ ప్రాంతానికి వచ్చి టిడ్కో ఇళ్లను తామే కట్టించామని చెప్పుకుంటారని, ఆ మాటలను నమ్మవద్దన్నారు. మీ ఓట్లే కావాలని, మీకు ఇళ్లు కట్టించి ఇవ్వడం మాత్రం ఆయనకు ఇష్టం లేదని అన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాకా ఏఎస్సార్ నగర్‌లో అసంపూర్తిగా వదిలేసిన ఇళ్ల గురించి తానే స్వయంగా కాంట్రాక్టర్‌తో మాట్లాడి, అధికారులను సమన్వయపరచి వేగంగా ఈ ప్రాజెక్టును పూర్తిచేయించానని కె.కె.రాజు తెలిపారు.

చేరువలో ఉద్యోగాలు: కంపా హనోకు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్ లక్షల రూపాయల విలువైన ఆస్తిని టిడ్కో గృహ లబ్ధిదారులకు సర్వహక్కులతో అందజేశారని కార్పొరేటర్ కంపా హనోకు తెలిపారు. త్వరలో మీ పక్కనే ఇనార్బిట్ మాల్ నిర్మాణం పూర్తవుతుందని, తద్వారా అనేక మంది స్థానికులకు ఉద్యోగాలు లభిస్తాయన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి కొనసాగాలంటే, ప్రజలంతా సుఖసంతోషాలతో గడపాలంటే మరోసారి వైఎస్ జగన్ ముఖ్యమంత్రి కావాలని, ఉత్తరలో కె.కె.రాజును ఎమ్మెల్యేగా గెలిపించుకోవాలని కోరారు.

134 మందికి రిజిస్ట్రేషన్ పత్రాలు

ఏఎస్సార్ నగర్‌లో మొత్తం 284 ఇళ్లు పూర్తి కాగా.. వీరిలో 134 మందికి రిజిస్ట్రేషన్లు పూర్తయ్యాయని, త్వరలోనే మిగిలిన వారికి కూడా రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తవుతుందని జీవీఎంసీ అధికారులు తెలిపారు. ముందుగా ఏఎస్సార్ నగర్ వ్యవస్థాపక అధ్యక్షుడు దివంగత నల్లబోతుల రాములు చిత్రపటానికి కె.కె.రాజు తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు పైడి రమణ, జీవీఎంసీ ఏపీడీ పద్మావతి, అధికారులు, వార్డు నాయకులు హరి పట్నాయక్, ఆదిలక్ష్మి, నాయుడు, సన్ని, బాబూరావు, దుర్గ, గణపతి, మాత ఈశ్వర్, సతీష్, పైడి నాగరాజు, నరసారావు, సచివాలయ సిబ్బంది, ఆర్పీలు పాల్గొన్నారు.

సీఎం జగన్‌కు రుణపడి ఉంటాం



కొని దశాబ్దాలుగా ఇదే ప్రాంతంలో నివసిస్తున్నాం. ఎండకు, వానకు ఎన్నో ఇబ్బందులు పడ్డాం. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ దయతో నేడు మా అందరికీ సొంతిళ్లు అందాయి. రిజిస్ట్రేషన్లు కూడా చేయించి అన్ని వసతులతో ఉచితంగా ఇళ్లను అందజేసిన జగన్ రుణం తీర్చుకోలేం. మా కోసం నిత్యం తపించే కె.కె.రాజు, కంపా హనోకు, పైడి రమణలకు ధన్యవాదాలు.

– నల్లబోతుల పెంటమ్మ, లబ్ధిదారు

సొంతింటి కల నిజం చేశారు



ఏఎస్సార్ నగర్‌లో మా కోసం ఇళ్లు కట్టిస్తామని గత పాలకులు హామీ ఇచ్చి, శంకుస్థాపన చేసి మధ్యలోనే వదిలేశారు. వైఎస్సార్‌సీపీ నేతలు కె.కె.రాజు, కంపా హనోకు, పైడి రమణ మా పరిస్థితిని గమనించి భరోసానిచ్చి మా సొంతింటి కలను నిజం చేశారు. సీఎం జగన్ సహకారం మరువలేనిది. నిరుపేదలుగా ఉన్న మమ్మల్ని లక్షాధికారులను చేశారు.

– ఆవుల మంగమ్మ, లబ్ధిదారు

క్లుప్తంగా

ట్రాఫిక్ పోలీసుల స్పెషల్ డ్రైవ్


ఏసీపీ పర్యవేక్షణలో డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్ చేస్తున్న కంచరపాలెం ట్రాఫిక్ పోలీసులు

మర్రిపాలెం: విజువల్ పోలీసింగ్‌లో భాగంగా కంచరపాలెం ట్రాఫిక్ పోలీసులు శుక్రవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ట్రాఫిక్ ఏసీపీ రాజీవ్‌కుమార్ పర్యవేక్షణలో కంచరపాలెం ట్రాఫిక్ సీఐ ప్రసాదరావు, ఎస్‌ఐలు అన్వర్, బాలరాజు బర్మాక్యాంప్ నుంచి ఊర్వశి జంక్షన్ వరకు ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఫుట్‌పాత్‌ల ఆక్రమణ, రాంగ్‌రూట్ డ్రైవింగ్, రాంగ్ పార్కింగ్, ట్రిపుల్ రైడింగ్, డ్రంక్ అండ్ డ్రైవ్, రాష్ డ్రైవింగ్ వంటి ట్రాఫిక్ రూల్స్‌పై డ్రైవ్ నిర్వహించి తనిఖీలు చేశారు.

ట్రాఫిక్ రూల్స్ పాటించాలి


మైనర్లకు అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ ఎస్‌ఐ భాస్కరరావు

సీతమ్మధార: ప్రతి ఒక్క వాహన చోదకుడు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, వాహనాలకు సంబంధించిన పత్రాలు ఉండాలని ద్వారకా పోలీస్ స్టేషన్ ట్రాఫిక్ ఎస్‌ఐ భాస్కరరావు అన్నారు. గురుద్వారా తదితర ప్రాంత్రాల్లో శుక్రవారం పెండింగ్ చలనాలపై డ్రైవ్ నిర్వహించారు. హెల్మెట్ ధరించిన వాహనదారులు, మైనర్లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ అతి వేగంగా వాహనాలు నడిపితే చర్యలు తీసుకుంటామని, మైనర్లకు ద్విచక్ర వాహనాలు ఇస్తే తల్లిదండ్రులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. బైక్‌లకు ఎక్కువ శబ్దం వచ్చే సైలెన్సర్లు వాడకూడదన్నారు. పెండింగ్ చలనాలు వెంటనే చెల్లించాలని సూచించారు. ఈ తనిఖీల్లో హెచ్‌సీలు, సిబ్బంది పాల్గొన్నారు.

గెడ్డల నిర్మాణంపై పరిశీలన


వర్క్ ఇన్‌స్పెక్టర్‌తో కలిసి పరిశీలిస్తున్న కార్పొరేటర్ వావిలపల్లి ప్రసాద్

మర్రిపాలెం: జీవీఎంసీ 50వ వార్డులో పలు గెడ్డల నిర్మాణాల కోసం శుక్రవారం కార్పొరేటర్ వావిలపల్లి ప్రసాద్ పరిశీలించారు. వంశీనగర్, మాధవధారలోని ప్రధాన గెడ్డలకు సంబంధించి చేయాల్సిన నిర్మాణంపై జీవీఎంసీ అధికారులతో ఆయన చర్చించారు. గెడ్డల రక్షణ గోడ, బాటం వర్క్‌కు సంబంధించి శనివారం శంకుస్థాపన చేస్తామని, అనంతరం త్వరితగతిన పనులు ప్రారంభిస్తామని కార్పొరేటర్ తెలిపారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా పనులు పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.

కనిపించని క్రైం పోలీసులు


సిబ్బంది లేక ఖాళీగా ఉన్న ద్వారకా క్రైం స్టేషన్

సీతమ్మధార: ద్వారకా క్రైం పోలీస్ స్టేషన్‌లో గురువారం ఉదయం సిబ్బంది జాడలేదు. మధ్యాహ్నం 12 గంటలు అయినప్పటికీ స్టేషన్‌లో సిబ్బంది లేక కుర్చీలు ఖాళీగా కనిపించాయి. స్టేషన్‌లో ఎవరూ లేకపోవడంతో వచ్చిన ఫిర్యాదుదారులు తిరిగి వెళ్లిపోయారు. ఎస్‌ఐ, ఏఎస్‌ఐ, సిబ్బంది ఎవరూ లేకపోవడంతో క్రైం స్టేషన్ వెలవెలబోయింది. ఉన్నతాధికారులు దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.

గొల్ల బాబూరావుకు ఘన స్వాగతం


రాజ్యసభ సభ్యుడు గొల్ల బాబూరావుకు స్వాగతం పలుకుతున్న డిప్యూటీ మేయర్లు కటుమూరి సతీష్, జియ్యాని శ్రీధర్

సీతంపేట: వైఎస్సార్‌సీపీ తరఫున రాజ్యసభ సభ్యుడిగా ఏకగ్రీవంగా ఎన్నికై మొదటి సారి విశాఖపట్నం విచ్చేసిన గొల్ల బాబూరావుకు శుక్రవారం విశాఖ ఎయిర్‌పోర్ట్‌లో పార్టీ శ్రేణులతో కలిసి జీవీఎంసీ డిప్యూటీ మేయర్లు కటుమూరి సతీష్, జియ్యాని శ్రీధర్ ఘన స్వాగతం పలికారు. శాలువాతో ఆయనను సత్కరించి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

27న కేజీహెచ్‌లో పీఐసీయూ ప్రారంభం

మహారాణిపేట: కేజీహెచ్ పిల్లల వార్డులో రూ.80 లక్షలతో నిర్మిస్తున్న పీడియాట్రిక్ ఇంటెన్సివ్ కేర్ యూనిట్(పీఐసీయూ) ఈ నెల 27న ప్రారంభం అవుతుంది. వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని ఈ యూనిట్‌ను ప్రారంభిస్తారని సూపరింటెండెంట్ డాక్టర్ పి.అశోక్‌కుమార్ శుక్రవారం మీడియా ప్రతినిధులకు తెలిపారు. మొత్తం 40 పడకలతో ఏర్పాటు చేస్తున్న ఈ యూనిట్‌లో ఒక ఏడాది నుంచి ఏడేళ్లలోపు పిల్లల సంపూర్ణ ఆరోగ్యం కోసం చికిత్స అందిస్తామన్నారు. ఆంధ్రా మెడికల్ కాలేజీ నిధులు రూ. 20 లక్షలు, కేజీహెచ్ నిధులు రూ.20 లక్షలు, కలెక్టర్ మల్లికార్జున అందించే సీఎస్సార్ ఫండ్ రూ.40 లక్షలతో ఈ యూనిట్ నిర్మిస్తున్నామన్నారు.

ముస్లింలను ఓటు బ్యాంక్‌గా వాడుకున్న చంద్రబాబు


మాట్లాడుతున్న కేవీ బాబా

కొమ్మాది: నాడు చంద్రబాబు నాయుడు ప్రభుత్వంలో ముస్లింలను ఓటు బ్యాంక్‌గా వాడుకున్నారని వైఎస్సార్‌సీపీ విశాఖ జిల్లా మైనారిటీ అధ్యక్షుడు కేవీ బాబా ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముస్లింల ద్రోహి అని టీడీపీ నేత నజీర్ విమర్శించడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బటన్ నొక్కి ప్రభుత్వ సంక్షేమ పథకాలను దళారీ వ్యవస్థలు లేకుండా నేరుగా బ్యాంకు ఖాతాల్లో వేసి, పేదవారికి అండగా ఉన్నారన్నారు.

టీడీపీ ప్రభుత్వంలో జన్మభూమి కమిటీలు ఇష్టానుసారం దోచుకునే వారని, ప్రజలను మోసం చేసేవారన్నారు. నేడు వైఎస్సార్‌సీపీ పాలనలో అవినీతికి, లంచాలకు తావు లేకుండా వలంటీర్ వ్యవస్థ ప్రవేశపెట్టి వైఎస్ జగన్ జన హృదయ నేతగా నిలిచారన్నారు. డీబీటీ, నాన్ డీబీటీ ద్వారా సుమారు రూ. 24 వేల కోట్లు అందజేసిన ఘనత జగన్ మోహన్‌రెడ్డిది అన్నారు. నాడు చంద్రబాబు పాలనలో షాదీ తోఫా కింద రూ. 50 వేలు అందిస్తే.. నేడు సీఎం జగన్ రూ.లక్ష అందిస్తున్నారని, 2022-23 హజ్ యాత్రలకు వెళ్లిన 2977 హాజీలకు రూ. 20 కోట్ల 3 లక్షలు ఖర్చు పెట్టిన ఘనత ముఖ్యమంతిర వైఎస్ జగన్‌దేనని అన్నారు.

మైనారిటీల పక్షపాతి సీఎం జగన్

ఆక్రమణలకు గురైన 32 వేల ఎకరాల వక్ఫ్ ఆస్తులను తిరిగి స్వాధీనం చేసుకునేందుకు స్వతంత్ర అధికారాలు ఇస్తూ వక్ఫ్ ట్రిబ్యునల్ ఏర్పాటు చేసిన మైనారిటీల పక్షపాతి సీఎం జగన్ అని కొనియాడారు. చంద్రబాబు హయాంలో ఇమామ్‌లకు ఇచ్చే రూ. 5వేలును పది వేలకు, మౌజన్‌లకు ఇచ్చే రూ.3 వేలను రూ.5వేలకు పెంచిన ఘనత సీఎం జగన్‌దే అన్నారు. చంద్రబాబు ముస్లింలను రాజకీయంగా అభివృద్ధి చేయలేదని.. కానీ సీఎం జగన్ ఒక ఉప ముఖ్యమంత్రిని, ఒక శాసన మండలి డిప్యూటీ చైర్ పర్సన్‌ను, నలుగురు ఎమ్మెల్యేలను, నలుగురు ఎమ్మెల్సీలను, ఇద్దరు మేయర్లను, 11మంది మున్సిపల్ చైర్‌పర్సన్లను ఇచ్చి మైనారిటీలను రాజకీయంగా అభివృద్ధి చేశారన్నారు. నాటికి, నేటికి ముస్లింలకు ఏం అభివృద్ధి జరిగిందో తేల్చుకునేందుకు టీడీపీ నాయకులు సిద్ధమా అని ప్రశ్నించారు.

రోడ్డు ప్రమాదాల నియంత్రణకు చర్యలు


బిర్లా జంక్షన్ వద్ద స్టాపర్లను ప్రారంభిస్తున్న ట్రాఫిక్ ఏసీపీ రాజీవ్‌కుమార్ తదితరులు

మర్రిపాలెం: రోడ్డు ప్రమాదాల నియంత్రణకు కంచరపాలెం ట్రాఫిక్ పోలీసులు ఎప్పటికప్పుడు చర్యలు చేపడుతున్నారు. శుక్రవారం సాయంత్రం బిర్లా జంక్షన్ వద్ద ఉన్న డెకాథలిన్ స్పోర్ట్స్ షోరూం వద్ద ట్రాఫిక్ ఏసీపీ రాజీవ్‌కుమార్, ట్రాఫిక్ సీఐ ఎ.ప్రసాద్‌రావుతో కలిసి స్టాపర్లను ప్రారంభించారు. జంక్షన్లలో ప్రమాదాలను తగ్గించేందుకు, వాహనాల వేగాన్ని నియంత్రించేందుకు స్టాపర్లను ఏర్పాటు చేసినట్టు ఏసీపీ తెలిపారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ ప్రయాణాలు కొనసాగించాలని, ఉల్లంఘించి వాహనాలు నడిపేవారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పక ధరించాలని, వేగంగా వాహనాలను నడపకూడదని, లేకుంటే కేసులు నమోదు చేసి, జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు. ట్రాఫిక్ పోలీసులకు సహకరించి స్టాపర్లను అందించిన వారికి అభినందనలు తెలిపారు. ఎయిర్‌పోర్టు సీఐ చక్రధర్, ఎస్‌ఐ రామకృష్ణ, ఎయిర్‌పోర్ట్ ట్రాఫిక్ ఎస్‌ఐ బాలరాజు, కంచరపాలెం ట్రాఫిక్ ఎస్‌ఐ అన్వర్ తదిరతులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని ఆందోళన


ఆందోళన చేస్తున్న మిమ్స్ ఉద్యోగులు

సీతంపేట: మిమ్స్ ఉద్యోగుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు తమ్మినేని సూర్యనారాయణ డిమాండ్ చేశారు. 23 రోజులుగా మిమ్స్ ఉద్యోగులు తమ న్యాయపరమైన సమస్యలు పరిష్కరించాలంటూ అధికారుల చుట్టూ తిరుగుతున్నా.. యాజమాన్యానికి కొమ్ముకాస్తున్నారని ఆరోపించారు. ఈ మేరకు శుక్రవారం అక్కయ్యపాలెం మెయిన్ రోడ్డులోని కార్మిక శాఖ కార్యాలయం వద్ద ఉద్యోగులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మిక శాఖ అధికారులు నిర్వహించే చర్చలకు మిమ్స్ యాజమాన్యం రాకుండా కార్మిక చట్టాలను ధిక్కరించిందన్నారు. మిమ్స్ యాజమాన్యం 7డీఏలు, బకాయిలు చెల్లించలేదన్నారు. కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని కోరారు. మిమ్స్ యాజమాన్యానికి కొమ్ము కాస్తున్న జేసీఎల్‌ను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు టి.వి.రమణ, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్, ఉద్యోగులు మిరప నారాయణ, కర్రోతు కామునాయుడు, మహంతి నాగభూషణం, మధు, మూర్తి, రాంబాబు, గౌరి, వరలక్ష్మి, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కేవీ విద్యార్థులకు బెస్ట్ స్మైల్ అవార్డులు


చిన్నారికి అవార్డు అందిస్తున్న హాస్పిటల్ డైరెక్టర్ రమేష్, ప్రిన్సిపాల్ కిషోర్‌కుమార్

కంచరపాలెం: స్థానిక 104 ఏరియా కేంద్రీయ విద్యాలయం-1లో వీ డెంటల్ హాస్పిటల్ వైద్య బృందం ఆధ్వర్యంలో శుక్రవారం దంతాల ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. నోటి శుభ్రత, దంతాల ఆరోగ్యాన్ని పాటిస్తున్న విద్యార్థులను ఎంపిక చేసి వారికి బెస్ట్ స్మైల్ అవార్డులను ప్రదానం చేశారు. సుమారు 1,400 మంది విద్యార్థులకు ఉచితంగా దంత వైద్య పరీక్షలు చేశారు. వైద్య బృందాన్ని పాఠశాల ప్రిన్సిపాల్ కిషోర్ కుమార్ అభినందించారు. సుమారు 350 మంది విద్యార్థులకు హాస్పిటల్ డైరెక్టర్ కె.ఎం.కె.రమేష్ చేతుల మీదుగా బెస్ట్ స్మైల్ అవార్డులను అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ ఆకాంక్ష పట్నాయిక్, డాక్టర్ మనోహర్, కె.తులసి, ధనలక్ష్మి పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు జారిపడిన వ్యక్తి మృతి

మర్రిపాలెం: కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ వ్యక్తి ఇంట్లో జారిపడి చికిత్స పొందుతూ మృతిచెందిన ఘటన వెలుగుచూసింది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. జ్ఞానాపురంలో నివసిస్తున్న దుక్కా ఆనంద్(46) అనే వ్యక్తి పెయింటర్‌గా పనిచేస్తుంటాడు. ఈ నెల 19వ తేదీ రాత్రి ఇంట్లో బాత్రూంకి వెళ్లి ప్రమాదవశాత్తు జారి పడిపోవడంతో గాయాలయ్యాయి. దీంతో అతడిని కేజీహెచ్‌కు తరలించారు. సదరు వ్యక్తి చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం 11 గంటల ప్రాంతంలో మృతిచెందాడు. అతడి భార్య దుక్కా రామలక్ష్మి ఫిర్యాదు మేరకు సీఐ ఎస్.భాస్కర్‌రావు నేతృత్వంలో ఏఎస్‌ఐ రాజారావు కేసు దర్యాప్తు చేపట్టారు.

ద్విచక్ర వాహనం చోరీ

సీతమ్మధార: ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో క్రైం పోలీసులు ద్విచక్ర వాహనం చోరీ కేసు నమోదు చేశారు. వివరాలిలా.. అక్కయ్యపాలెం చిన్నూర్ మసీదు ప్రాంతానికి చెందిన సురేష్ అనే యువకుడు తన ద్విచక్ర వాహనాన్ని గురువారం రాత్రి ఇంటి ముందు పార్క్‌చేశాడు. శుక్రవారం ఉదయం లేచి చూసేసరికి వాహనం కనిపించలేదు. వెంటనే యువకుడు ఫోర్త్‌టౌన్ క్రైం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో క్రైం ఎస్‌ఐ భాస్కరరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రైల్వేస్టేషన్‌లో 16.5 కిలోల గంజాయి పట్టివేత

తాటిచెట్లపాలెం: విశాఖ రైల్వేస్టేషన్‌లో అక్రమంగా గంజాయి తరలిస్తున్న నిందితుడిని గవర్నమెంట్ రైల్వే పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. జీఆర్పీ సిబ్బంది తెలిపిన వివరాలిలా.. డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ రైల్వే పోలీస్ బి.మోహనరావు ఆదేశాలతో జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ సిహెచ్.ధనుంజయనాయుడు ఆధ్వర్యంలో ఎస్‌ఐ జి.శ్రీనివాసరావు సిబ్బందితో కలిసి రైల్వేస్టేషన్‌లోని పలు ప్లాట్‌ఫామ్స్‌లో శుక్రవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఒడిశా కందమాల్ జిల్లాకు చెందిన బిమల్ కన్హర్ బ్యాగును తనిఖీ చేయగా.. అక్రమంగా రవాణా చేస్తున్న సుమారు 16.5 కేజీల గంజాయి గుర్తించారు. ఈ వ్యక్తి గుణుపూర్ నుంచి విశాఖ మీదుగా కర్నాటకకు రైలులో గంజాయిని తీసుకెళ్తున్నట్లు విచారణలో అంగీకరించినట్లు జీఆర్పీ సిబ్బంది తెలిపారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని, గంజాయి స్వాధీనం చేసుకుని రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరుపరిచినట్లు జీఆర్పీ ఎస్‌ఐ శ్రీనివాసరావు తెలిపారు.

విద్యార్థులు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి


విజేతలకు బహుమతి ప్రదానం చేస్తున్న డీఈవో చంద్రకళ

సీతమ్మధార: విద్యార్థులు చదువుతోపాటు ఉపాధి కల్పనా అవకాశాలను అన్వేషించి పారిశ్రామికవేత్తలుగా ఎదిగేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని జిల్లా విద్యా శాఖాధికారి ఎల్.చంద్రకళ పిలుపునిచ్చారు. గురుద్వారాలోని వసంతబాల విద్యోదయ పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన ఎంటర్‌ప్రెన్యూర్ మైండ్‌సెట్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం జిల్లాస్థాయి ఎక్స్‌పో కార్యక్రమాన్ని ముఖ్య అతిథిగా ఆమె ప్రారంభించారు. 11 పాఠశాలలకు చెందిన విద్యార్థులు తమ ప్రాజెక్టులను ప్రదర్శించారు. వీటిని డీఈవో చంద్రకళ, డిప్యూటీ డీఈవో గౌరీశంకర్, ఏపీసీ శ్రీనివాసరావు, జిల్లా సైన్స్ అధికారి కె.ప్రసాద్‌లు పర్యవేక్షించారు. సైన్స్ ప్రదర్శనలో జ్ఞాననికేతన్ ఎయిడెడ్ స్కూల్‌కు ప్రథమ స్థానం, జీహెచ్‌ఎస్ రైల్వే కాలనీ స్కూల్ ద్వితీయ స్థానానికి ఎంపిక కాగా.. ఈ రెండు ప్రాజెక్టులు రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు అధికారులు వెల్లడించారు. ఎంపిక జ్యూరీ కమిటీ సభ్యులుగా టి.రామ్‌కుమార్, లక్ష్మి వ్యవహరించారు. విజేతలకు డీఈవో చంద్రకళ చేతుల మీద బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఎండీపీ స్టేట్ హెడ్ సతీష్, జోనల్ మేనేజర్ అగ్నిహోత్ర శర్మ, జిల్లా మేనేజర్ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

క్షయ వ్యాధి నివారణపై అవగాహన


పిఠాపురంకాలనీ బజార్‌లో అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి మన్‌మోహన్, ఆరోగ్య సిబ్బంది

సీతమ్మధార: రెండు వారాల కంటే ఎక్కువగా దగ్గు, జ్వరం, బరువు తగ్గడం వంటి లక్షణాలు ఉన్నవారు తక్షణమే పరీక్షలు చేయించుకోవాలని రేసపువానిపాలెం యూపీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ఆర్.మన్‌మోహన్ సూచించారు. జిల్లా ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరావు, జిల్లా క్షయ నివారణాధికారి డాక్టర్ జి.హెచ్.పూర్ణేంద్రబాబు ఆదేశాల మేరకు క్షయ వ్యాధి నివారణ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్థానిక ప్రాంతాలతోపాటు పిఠాపురం కాలనీ బజారులో అవగాహన కార్యక్రమం నిర్వహించి, కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యాధి నిర్ధారణైతే క్షయ నివారణ కేంద్రం ద్వారా ఉచితంగా వ్యాధి తగ్గే వరకు మందులు ఉచితంగా అందిస్తామని తెలిపారు. వైద్య సిబ్బంది ఇంటింటి సర్వేలో వ్యాధిగ్రహస్తులను గుర్తించి ప్రజల్లో మరింత అవగాహన తీసుకురావాలని ఆదేశించారు. కార్యక్రమంలో సత్యనారాయణ, సునీత, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

జాబ్‌మేళాలో 126 మంది ఎంపిక


అభ్యర్థులకు సూచనలిస్తున్న అధికారి సుబ్బిరెడ్డి

కంచరపాలెం: స్థానిక జిల్లా ఉపాధి కార్యాలయంలోని నేషనల్ కెరీర్ సర్వీస్ సెంటర్‌లో ఆంధ్రప్రదేశ్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ ట్రెనింగ్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన జాబ్‌మేళాకు విశేష స్పందన లభించిందని జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి సిహెచ్.సుబ్బిరెడ్డి(క్లరికల్) తెలిపారు. సుమారు 13 ప్రైవేటు లిమిటెడ్ కంపెనీల్లో 905 ఉద్యోగాల భర్తీకి జరిగిన ఇంటర్వ్యూల్లో 680 మంది అభ్యర్థులు హాజరు కాగా.. 126 మంది ఎంపికైనట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు. ఎంపికైన వారికి సుబ్బిరెడ్డి చేతుల మీదుగా నియామక పత్రాలు అందజేశారు. నిరుద్యోగ యువతకు పలు కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందని ఆయన అన్నారు.

లలితాదేవి నగరోత్సవం నేడు


విశేష అలంకరణలో లలితాదేవి


యాగశాలలో హారతి ఇస్తున్న పీఠాధిపతి సిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి

సీతంపేట: లలితానగర్‌లోని శ్రీలలితా పీఠం 75వ వార్షికోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. దీనిలో భాగంగా శుక్రవారం అమ్మవారికి పసుపు, కుంకుమలతో విశేష అలంకారం చేశారు. పీఠాధిపతి సిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి లలితాదేవికి, యాగశాలలో మండపారాధనకు, కాళీకాలభైరవులకు స్వయంగా హారతులిచ్చారు. అమృతోత్సవాల ముగింపు సందర్భంగా శనివారం సాయంత్రం 6 గంటలకు లలితా అమ్మవారికి విశేష నగరోత్సవం నిర్వహించనున్నారు. ప్రత్యేక రథంపై అమ్మవారి ఉత్సవమూర్తిని ఊరేగించనున్నట్టు పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ తెలిపారు. ఉదయం కాళీ కాలభైరవులకు విశేష పూజలు, శాంతి హోమాలు, మహా కుంభాభిషేకం, మహాపూర్ణాహుతి జరుగుతాయని, భక్తులు పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

29న పార్వతీశ్వరుడి కల్యాణోత్సవం

సీతంపేట: జీవీఎంసీ 25వ వార్డు సీతంపేట పార్వతీశ్వరాలయంలో స్వామి 34వ వార్షిక కల్యాణానికి ఏర్పాట్లు చేస్తున్నట్టు ఆలయ అర్చకుడు భాస్కరశర్మ తెలిపారు. ఈ నెల 28న ఉదయం 7 గంటలకు మంగళస్నానం, 29న ఉదయం 9.30 గంటలకు గణపతి పూజ, పుణ్యాహవచనం, స్వామి వారి కల్యాణం, మార్చి 1న సాయంత్రం 6 గంటలకు సారె ఊరేగింపు జరుగుతాయని చెప్పారు.